# 17. దైవమార్గంలో ఖర్చు

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ (రజిఅన్) ఉల్లేఖించారు : "మీలో తమ సొమ్ము కన్నా ఎక్కువగా తమ వారసుని సొమ్మును ఇష్టపడే వారెవరు?" అని ప్రవక్త ప్రశ్నించగా, 'మాలో ప్రతి ఒక్కరికీ వారసుల సొమ్ముకన్నా, తమ స్వంత సొమ్మే ప్రీతికరమైంది' అని సహాబాలు బదులిచ్చారు. ఆయన (సఅసం) ప్రబోధించారు : "వాస్తవానికి మనిషి సొమ్మయితే అతను (పరలోకానికి) పంపుకున్నదే. ఇక అతను వదలిపెట్టిపోయేదంతా అతని వారసులది." (బుఖారి)

హాఫిజ్ మూసలి కూడా ఈ హదీసును ఉల్లేఖించారు. అయితే ఈయనగారు ఉల్లేఖించిన హదీసులో రెండు వాక్యాలు అదనంగా ఉన్నాయి. "మాలో ప్రతి ఒక్కరికి మా వారసుల సొమ్ముకన్నా మా సొంత సొమ్మే ప్రీతికరమైనద"ని ప్రవక్త సహచరులు విన్నవించుకున్నప్పుడు మహాప్రవక్త (సఅసం) ఇలా అంటారు : "మీరేమంటున్నారో బాగా అర్థం చేసుకోండి." దానికి సహచరులు, "ఓ దైవప్రవక్తా! మాకైతే తెలిసింది ఇంతే" అన్నారు. అప్పుడు దైవప్రవక్త (సఅసం), "మీరు పంపుకున్నదే అసలు మీ సొంతం. మీరు విడిచిపెట్టిపోయేది మీ వారసులది" అని పలికారు.

దైవప్రవక్త (సఅసం) తన ప్రియసహచరుల ఆంతర్యాల్లో పరలోకం పట్ల విశ్వాసాన్ని పటిష్టం చేయడానికి, దాతృగుణం వారిలో పెంపొందింపజేయడానికి పలు దృష్టాంతాలను, విధానాలను చూపించారు. దైనందిన జీవితంలో ఎదురయ్యే సంఘటనల ద్వారానే పరలోక ఉద్దేశ్యాలను, పరమార్థాలను విపులీకరించేవారు. ఈ హదీసులో ఆయన (సఅసం) తన సహచరులను ఒక విలక్షణమైన పద్ధతి ద్వారా దైవమార్గంలో ఖర్చుకోసం పురికొలిపారు.

మృతుడు వదలిపెట్టిన డబ్బు దస్కం, ఇల్లూ వాకిలీ ఇతర స్థిరచరాస్తులు అన్నీ అతని వారసునికే చెందుతాయి.

(1) "అతను ముందు (పరలోకానికి) పంపుకున్నదే అతని సొంత ఆస్తి" అనే హదీసు వాక్యంలోని లోతులను ఇప్పుడు తెలుసుకుందాం.

మనిషి చేసుకున్న కర్మలే అతన్ని వెంటాడి వస్తాయి. ఎవరు చేసిన కర్మను వారనుభవించక తప్పదన్నది లోకోక్తి. అయితే ప్రపంచంలో అల్లాహ్ తనకు ప్రసాదించిన శక్తియుక్తులు, సిరిసంపదలను మనిషి అల్లాహ్ మార్గంలో గనక ఖర్చుచేస్తే వాటి పుణ్యఫలం పరలోకంలోని, అతని ఖాతాలో జమ అవుతూ ఉంటుంది. ఎప్పుడయితే అతను చనిపోయి, తన ప్రభువు సన్నిధికి చేరుకుంటాడో అప్పుడు అతని పుణ్య ఫలం అతనికి అపూర్వంగా స్వాగతం పలుకుతుంది. ప్రపసమక్షంలో అతనికి గౌరవస్థానం ఆర్జించి పెడుతుంది.

హదీసు ద్వారా తెలిసే మరో చేదు సత్యం ఏమంటే, ఎవరయితే ధనాన్ని దైవమార్గంలో

https://teluguislam.net

ఖర్చు పెట్టకుండా పిసినిగొట్టుగా మారి ఒక్కొక్క పైసా తన వారసుల కోసం కూడబెడతాడో, అతడు అత్యంత అవివేకి అతనికి అతని వారసుల గురించి చింత ఉందిగాని తన స్వయం గురించిన ధ్యాసే లేదు. పర్యవసానంగా అతను తన పరలోక జీవితాన్ని చేతులారా నాశనం చేసుకుంటున్నాడు. అటువంటి వ్యక్తి తీర్పుదినం నాడు ఘోర పరాభవానికి గురికాక తప్పదని విదితమవుతోంది.

ఇబ్నె బుతాన్ ఇలా అంటున్నారు -

ఈ హదీసులో సత్కార్యాలు మరియు దైవమార్గంలో వీలైనంత అధికంగా ఖర్చు చేయటంపై పురికొల్పటం జరిగింది. అలా చేయటం వల్ల మనిషి పరలోకంలో సఫలీకృతుడవుతాడని దీని ఉద్దేశ్యం. మరణించేవాడు కూడబెట్టిన ప్రతిదీ అతని వారసులకు వెళ్ళిపోతుంది. అదే అతను బ్రతికి ఉండగా సత్యపథంలో, సత్కార్యాలలో ఎంతగా ఖర్చుపెడితే అంతగానే ఆ పుణ్యఫలాన్ని మరణానంతర జీవితంలో అనుభవిస్తాడు. అలా అని, ఐశ్వర్యాన్ని కలిగి ఉండటం తప్పు కూడా కాదు. అయితే దేవుని యెడల అవిధేయతకు ఒడిగడుతూ, పాపకార్యాలలో ఖర్చు పెడుతున్న వ్యక్తి ఎంత కష్టపడి, శ్రమకోర్చి ధనం సంపాదించినా అది అతనికి ప్రయోజనకారి కాబోదు.

జవసత్వాలు ఉడిగిపోకముందే - ఆరోగ్యవంతుడుగా ఉండగానే - దానధర్మాలు చేయటం, ఉపకారాలు చేసుకోవటం మంచిది. కాటికి కాళ్ళు జాపే తరుణంలో ఖర్చు చేయటం వేరు. సఅద్ బిన్ అబీ వఖాస్ (రజిఅన్) గురించి ఒక హదీసులో ఉంది - ఆయన తీవ్రంగా జబ్బుపడ్డారు. మరణకాలం దాపురించిందని ఆయనకు అనిపించింది. అట్టి స్థితిలో దైవప్రవక్త (సఅసం) ఆయన్ని పరామర్శించడానికి ఏతెంచారు. అప్పుడు సఅద్ (రజిఅన్) అన్నారు : "దైవప్రవక్తా! నేను నా ఆస్తి పాస్తులన్నింటినీ దైవమార్గంలో వెచ్చించాలని నిర్ణయించుకున్నాను." మహాప్రవక్త (స) గారు అందుకు అంగీకరించలేదు. దానికి బదులు మూడింట ఒక వంతు సొమ్మును ఖర్చుచేయటానికే అనుమతి ఇచ్చారు. ఆ తరువాత ఇలా హితబోధ చేశారు - "మూడింట ఒక వంతు ఖర్చుచేస్తే అదే ఎక్కువ. మీరు మీ వారసులను స్థితిపరులుగా వదలి వెళ్ళండి. మీరు వారిని (మీ వారసులను) ప్రజలకు భారంగా వదలిపెట్టటం కంటే ఇదే మీ కొరకు ఉత్తమం. మీరు గనక అలా చేయకపోతే వారు ప్రజల ఎదుట యాచిస్తూ తిరుగుతారు."

ఈ హదీసులోని సారాంశం ఏమిటంటే మరణ సమయంలో సిరిసంపదలన్నింటినీ దానం చేసేసి ఆలు బిడ్డలను అగత్యపరులుగా చేసివేయటం సమ్మతించదగిన విషయం కాదు. అయితే వృద్ధాప్యం రాకముందే, మనిషి ఆరోగ్యంగా ఉండి కష్టపడి సంపాదిస్తున్న రోజుల్లోనే విస్తృతంగా దైవమార్గంలో ఖర్చుపెట్టడం మంచిది. దీనికి భిన్నంగా పిసినారితనం ప్రదర్శించడం, భార్యాబిడ్డలను ఇంకా ఇంకా సుఖపెడదామన్న అత్యాశకుపోయి సంపదను పోగేస్తూ ఉండటం కూడా హర్షణీయం కాదు. ఈ రెండు విపరీత వాదాలకు మధ్య - మధ్యేమార్గాన్ని అవలంబించటం సబబు.

https://teluguislam.net

మనిషి చెమటోడ్చి సంపాదిస్తున్న రోజుల్లో దైవమార్గంలో ఖర్చుపెట్టినప్పుడే పరీక్షలో నెగ్గుకు వచ్చినట్లు లెక్క. మరణ ఘడియలు ఆసన్నమయినప్పుడు మనిషి సహజంగానే దైవం వైపునకు మరలుతాడు. కాని యౌవ్వన ప్రాయంలోనూ, శరీరంలో బలం ఉన్నప్పుడునూ రేయింబవళ్ళు కూడబెట్టే ఆలోచనలో ఉంటాడు. అన్ని పరిస్థితుల లోనూ దైవమార్గంలో ఖర్చు పెట్టాలన్న భావన కలిగి ఉండటమే సిసలయిన విజయం.

అబూజర్ (రజిఅన్) ఉల్లేఖనాన్ని ఇమామ్ బుఖారి (రహ్మాలై) ఇలా ఉటంకించారు: నేను (అబూజర్) ఒక రాత్రి బయటకు వెడలాను. ఆ సమయంలో దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఒంటరిగా నడుస్తూ కనిపించారు. ఆయన వెంట మరెవరూ లేరు. తను మరొకరి వెంట నడవటం బహుశా దైవప్రవక్తకు ఇష్టం లేదేమోనని నేను ఊహించాను. నేను చంద్రుని వెన్నెల్లో నడవసాగాను. ఆయన (సఅసం) వెనుదిరిగి నన్ను చూశారు. "ఎవరు?" అని కూడా ప్రశ్నించారు. "అల్లాహ్ నన్ను మీ పేర అర్పించుగాక! నేను అబూజర్‌ని" అని సమాధానమిచ్చాను. "అబూజర్! రండి" అని ఆయన (సఅసం) నన్ను పిలిచారు. నేను ఆయన వెంట కొంతసేపు నడుస్తూనే ఉన్నాను. కాస్సేపు గడిచాక ఆయన (సఅసం) ప్రవచించారు : "ఎక్కువ ఐశ్వర్యం ఉన్నవారే ప్రళయదినాన తక్కువ పుణ్యఫలాన్ని పొందుతారు. అయితే దైవ ప్రసాదితాన్ని పొంది, కుడివైపు నుంచీ, ఎడమవైపు నుంచీ, ముందు నుంచీ, వెనుక నుంచీ దైవమార్గంలో ఖర్చు చేసినవారి సత్కార్యాల కోసం సొమ్మును వెచ్చించిన వారి విషయం వేరు."

కుడి, ఎడమలు, ముందు వెనుకల నుంచీ అంటే ప్రతి మంచి కార్యంలోనూ - అది వ్యక్తిగత స్థాయిలోనయినా, సామూహిక స్థాయిలోనయినా - ఊగిసలాడకుండా, ఉదారంగా, దైవ ప్రసన్నతను బడసే లక్ష్యంతో ఖర్చుచేయటం అని అర్థం. దీని పరలోక పరమార్థాన్ని అల్లాహ్ పవిత్ర ఖుర్‌ఆన్‌లో ఇలా విశదపరిచాడు :

> **"నమాజ్‌ను నెలకొల్పండి, జకాత్ ఇవ్వండి. అల్లాహ్‌కు ఉత్తమ ఋణం ఇస్తూ ఉండండి. మీరు మీ స్వయం కొరకు దేన్నయితే ముందుగానే చేరవేస్తారో దాన్ని అల్లాహ్ వద్ద పొందుతారు. అతను ఎక్కువ శ్రేష్ఠుడు, గొప్ప ప్రతిఫలం కలవాడు. ఇంకా మీరు అల్లాహ్‌ను క్షమాభిక్ష కోరుతూ ఉండండి. నిశ్చయంగా అల్లాహ్ ఎక్కువగా మన్నించేవాడు, కనికరించేవాడూను." (అల్ ముజమ్మిల్ : 20)**

"ముందుగా చేరవేయటం" అంటే భావం దైవమార్గంలో, దైవకార్యాలలో మనస్ఫూర్తిగా ధనం ఖర్చు పెట్టడం. ఈ పద్దులలో ఖర్చుపెట్టినది పరలోకంలోని అతని ఖాతాలో చేరి సురక్షితంగా ఉంటుంది. అతను తన స్వామి సన్నిధికి వెళ్ళినప్పుడు, అతనికి ఎంతగానో ఉపయోగపడుతుంది.

https://teluguislam.net